7

సాక్షి విశాఖపట్నం

సోమవారం । 16 । డిసెంబర్ । 2024

కార్యకర్తలకు అండగా

వైఎస్సార్‌సీపీ



వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయం ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, ఎంపీ తనూజరాణి తదితరులు

- విశాఖ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో విజయసాయిరెడ్డి, బొత్స, అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ భరోసానిచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికలు, జీవీఎంసీ ఎన్నికల విజయోత్సవాలు చేసుకున్న పార్టీ కార్యాలయాన్నే మళ్లీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని కృష్ణా కళాశాల సమీపంలో వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ నెల 27న కరెంట్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు రీజినల్ కోఆర్డినేటర్‌గా మళ్లీ రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు గత ఎన్నికల్లో ఓడిపోయామనే ఆందోళన అవసరం లేదన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు అసంతృప్తికి గురయ్యారని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ముందుకు సాగాలన్నారు. 2027 ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పార్టీ జిల్లా కార్యాలయం ఎండాడలో ఉన్నా, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలనే నగర పార్టీ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. పార్టీ పదవులు అనుభవించి భీమిలి నుంచి ఒక వలస నాయకుడు రాజీనామా చేస్తే, ఆ నియోజకవర్గం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తే కార్యకర్తలు, నాయకులు అందరూ హాజరయ్యారన్నారు. నాయకుడు పోతే కార్యకర్త వెళ్లడనే విషయం తెలుసుకోవాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు,అరకు ఎంపీ తనూజారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మేయ ర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, చెంగల వెంకట్రావు, ముఖ్యనేతలు కాయల వెంకటరెడ్డి, రొంగలి జగన్నాథం, జాన్ వెస్లీ, కొండా రాజీవ్‌గాంధీ, చొక్కాకుల వెంకట్రావు, డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఉడా రవి, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ చిత్రంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, ఎంపీ తనూజరాణి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, సమన్వయకర్తలు కేకే రాజు, మళ్ల విజయప్రసాద్, వాసుపల్లి గణేష్‌కుమార్

రన్.. రన్.. మారథాన్



మారథాన్‌కు హాజరైన క్రీడాకారులు, నగరవాసులు



జాతీయ జెండాతో సందడిగా..

సుందర సాగర తీరం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. తెల్లవారు జాము.. ఆదివారం.. లేలేత సూర్య కిరణాలు పలకరిస్తుండగా పరుగు పెడుతుంటే.. ఆ అనుభూతే వేరు. ఎక్కడలేని శక్తి మొత్తం ఒక్కసారిగా వచ్చినట్టు.. పట్టలేనంత ఉత్సాహం. వెరసి వైజాగ్ నేవీ మారథాన్ ఉత్సాహంగా.. హుషారుగా సాగింది. పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు, క్రీడాకారులతో సాగర తీరం కిక్కిరిసిపోయింది. మామ్ అండ్ డాడ్‌తో మేము సైతం అంటూ చిన్నారులు ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొనడం విశేషం.



కుటుంబ సమేతంగా..



చిన్నారుల కేరింత



జోరుగా..హుషారుగా..



నేను సైతం...

8లో

నవ్వుల్.. మీనన్



నగరంలో ప్రముఖ సినీ నటి సంయుక్త మీనన్ సందడి చేశారు. గోపాలపట్నంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆదివారం పునఃప్రారంభమైంది. కార్యక్రమంలో సంయుక్త మీనన్ పాల్గొన్నారు. చిరునవ్వులు చిందిస్తూ హుషారుగా గడిపారు. ఆమెతో అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.

– గోపాలపట్నం

8లో

నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా..



ఎన్‌క్లోజరులో రెండు తెల్ల పులులు

ఇందిరాగాంధీ జూ పార్కులో తెల్ల పులులు వాటి ఎన్‌క్లోజర్‌లో ఒంటరిగా తిరగడం చూశాం. తాజాగా జతగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. జూలో మూడు తెల్ల పులులున్నాయి. వాటిలో ఒక్కొక్కటి చొప్పున సమయం కేటాయిస్తూ మూడింటిని ఒంటరిగా విడిచి పెట్టేవారు. అవి ఒంటరిగా ఎన్‌క్లోజరులో తిరుగుతూ సందర్శకులను అలరించేవి. ఇప్పుడు అవి జతగా కనిపిస్తున్నాయి. ఇక్కడ మూడింటిలో విజయ్ (మగది)ను ఉదయం 8.30 గంటలు నుంచి 11.30 గంటలు వరకు ఒంటరిగా విడిచిపెడుతున్నారు. అనంతరం మధ్యాహ్నం ఆహారం అందించిన తర్వాత బేకన్ (ఆడది), బాలు (మగది)ను జతగా విడిచిపెడుతున్నారు. అవి జంటగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. రెండూ ఒకదాని వెంట మరొకటి తిరుగుతూ, హుషారుగా పరుగెడుతూ సందడి చేస్తున్నాయి.

– ఆరిలోవ

పోర్టులో

దొంగలు పడ్డారు..!



పోర్టులో బొగ్గు నిల్వలు



సాక్షి, విశాఖపట్నం : పోర్టులో దొంగలు పడ్డారు..! దేశ విదేశాల నుంచి వస్తున్న సరకును క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.కోట్ల విలువైన సరకు మాయం అవుతున్నా అటు పోర్టు అధికారులు ఇటు హార్బర్ పోలీసుల చర్యలు శూన్యమనే చెప్పాలి. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)కు ప్రతి రోజూ వేల టన్నుల కోల్, మాంగనీస్, జిప్సం, ఖానిజం, ఇతర ముడిసరకులు వస్తుంటాయి. ఇన్నర్ హార్బర్‌లోని 19 బెర్తులు, అవుటర్ హార్బర్‌లోని 6 బెర్తుల్లో సరకు హ్యాండ్లింగ్ జరుగుతుంటుంది. ఏటా సుమారు 2 మిలియన్ టన్నుల థర్మల్, 7 మిలియన్ టన్నుల కోకింగ్, 10 మిలియన్ టన్నుల స్టీమ్ కోల్, సుమారు 15 మిలియన్ టన్నుల వరకూ ఐరన్ ఓర్, 3 మిలియన్ టన్నుల ఫెర్టిలైజర్స్..ఇలా దాదాపు 80 మిలియన్ టన్నుల సరకు హ్యాండ్లింగ్ పోర్టు నిర్వహిస్తుంటుంది. వచ్చిన కార్గోను నిల్వ చేసేందుకు పోర్టు సమీపంలోనే ప్లాట్లు ఏర్పాటు చేశారు. సరకు తీసుకొచ్చిన స్టెవడోర్లు ఆ ప్లాట్లలో నిల్వలు ఉంచి విక్రయాలకోసం వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు.

రూ.3.50 కోట్ల విలువైన కోల్, మాంగనీస్ మాయం

వారం వ్యవధిలో 1,280 టన్నుల మాంగనీస్, 2వేల టన్నుల కోల్ చోరీ

సెక్యూరిటీకి డబ్బాశ చూపి చోరీకి పాల్పడుతున్న ముఠా

హార్బర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

సెక్యూర్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి సరకు మాయం

ఈ ప్లాట్లలో నిల్వలుగా ఉన్న కోల్, మాంగనీస్, ఇతర కార్గో కొన్నాళ్లుగా మాయమవుతోంది. గతంలో నిల్వ చేసిన కార్గోలో 10 నుంచి 100 కిలోల వరకూ చిల్లర దొంగలు సరకు తీసుకెళ్లిపోయేవారు. వీటిని ఆపేందుకు ప్రైవేట్ సెక్యూర్టీని ప్లాట్ల వద్ద ఏర్పాటు చేశారు. విచిత్రంగా అప్పటి నుంచి పెద్ద మొత్తంలో కార్గో మాయమవ్వడం మొదలైంది. గత వారం పది రోజుల వ్యవధిలో ఏకంగా రూ.3.50 కోట్ల విలువైన కార్గో పోర్టులోని ప్లాట్ నుంచి మాయమైంది. ఇందులో రూ.1.50 కోట్లు విలువైన 2 వేల టన్నులకు పైగా కోల్ ఉంది. అదేవిధంగా పోర్టులోని లైన్ నం.13లో రూ.2 కోట్ల విలువైన 1,280 టన్నుల మాంగనీస్ కూడా చోరీకి గురైందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పోర్టు అధికారులు

ఈ వ్యవహారంపై పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండగా అటు పోర్టు అధికారులు కూడా తమకేమీ పట్టనట్లుగా ఉంటున్నారు. వ్యాపారులు, స్టెవడోర్ల నుంచి ఏటా రూ.కోట్లు వసూలు చేస్తున్న పోర్టు అక్కడ భద్రతా వ్యవహారాలపై మాత్రం కనీసం స్పందించడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోర్టు అధికారులను పలుమార్లు స్టెవడోర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తున్నా.. వీపీఏ సెక్యూర్టీ విభాగం బుట్టదాఖలు చేస్తోంది. ట్రాఫిక్ విభాగాధికారికి ఫిర్యాదు చేసినా తన పరిధి కాదంటూ తప్పించుకు తిరుగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మొత్తంగా మేజర్ పోర్టులతో పోటీపడుతున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న విశాఖపట్నం పోర్టులో చిల్లర దొంగతనాలు నిరోధించకపోతే ప్రైవేట్ పోర్టులవైపు వెళ్లక తప్పదని కార్గో వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

హార్బర్ పోలీసులపైనా ఆరోపణలు

ఈ చోరీ వ్యవహారంలో హార్బర్ పోలీసుల పైనా కొందరు వ్యాపారులు, స్టెవడోర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలల క్రితం ఇదే తరహాలో భారీగా కోల్ కార్గో దొంగతనంగా తరలిస్తుండగా కొందరు వ్యాపారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని హార్బర్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే హార్బర్ పోలీసులు మాత్రం చోరీ చేసిన వారిని కేవలం వార్నింగ్ ఇచ్చి విడిచిపెట్టేశారని, ఎలాంటి కేసు నమోదు చెయ్యలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు మళ్లీ వరుసగా చోరీలు జరుగుతున్నాయని పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. దొంగతనాలు జరగకుండా నిరోధించేందుకు నైట్ పెట్రోలింగ్ అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నా.. పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పోర్టులోని ఓ ప్లాట్ దగ్గర ఆగి ఉన్న ఢిల్లీ రిజిస్ట్రేషన్ కారు

ప్రైవేట్ సెక్యూర్టీకి ఆశ చూపించి..

కార్గోను నిల్వ ఉంచేందుకు పోర్టు.. ప్లాట్లు ఏర్పాటు చేసింది. ఈ ప్లాట్లలో సరకు నిల్వ ఉంచేందుకు వ్యాపారుల నుంచి టన్ను చొప్పున రుసుం వసూలు చేస్తుంటుంది. డబ్బులు చెల్లిస్తున్నా పోర్టు మాత్రం సరైన భద్రతా చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇదే అదనుగా కొందరు ముఠాగా ఏర్పడి ప్లాట్లలో పనిచేస్తున్న సెక్యూర్టీ సిబ్బందికి, స్థానికులకు డబ్బాశ చూపిస్తున్నారు. రూ.కోట్లు విలువైన కార్గోను దొంగిలించిన రోజున సహకరిస్తున్న వారందరికీ రూ.వేలల్లో ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది.

ఉరకలెత్తిన ఉత్సాహం


మారథాన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

- ఆహ్లాదకరంగా సాగిన వైజాగ్ నేవీ మారథాన్
- ప్రత్యేక ఆకర్షణగా విదేశీ అథ్లెట్లు
- కుటుంబాలతో సహా హాజరైన నేవీ ఉద్యోగులు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వెటరన్ అథ్లెట్ రాములు



మారథాన్ వుమన్ విజేతకు లక్ష బహుమతి అందిస్తున్న నిర్వాహకులు, 10కె రన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు కడలి అలల హోరు.. మరో వైపు పరుగు వీరుల జోరుతో బీచ్‌రోడ్డులో పండగ వాతావరణం నెలకొంది. 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' నినాదంతో తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో ఏటా జరిగే నేవీ మారథాన్ ఆదివారం సాగరతీరం ఒంపుసొంపుల్లో ఉల్లాసంగా సాగింది. తెల్లవారుజామున వేలాది మంది యువత, నేవీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు హుషారుగా పరుగు పెట్టారు. మారథాన్ 9వ ఎడిషన్‌లో ఐదు కిలోమీటర్ల ఫన్ విభాగంలో ఔత్సాహికులు సరదాగా పరుగు పెడితే.. మిగిలిన విభాగాల్లో అథ్లెట్లు విజయమే లక్ష్యంగా శ్రమించారు.

ఆదివారం తెల్లవారుజాము 4.15 గంటలకే ఫుల్ మారథాన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ రన్ 42 కిలోమీటర్ల పరుగుకు అథ్లెట్లు సిద్ధమయ్యారు. బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం దరి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఈ పరుగు ప్రారంభమైంది. కురుపాం సర్కిల్, తెన్నేటి పార్క్, గాయత్రి కళాశాల, తొట్లకొండ, చేపలుప్పాడ మీదుగా ఐఎన్ఎస్ కళింగకు చేరుకుని.. తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకోవడంతో ఈ మారథాన్ ముగిసింది. సబ్‌మెరైన్ రన్ 21 కిలోమీటర్ల మేర సాగింది. ఈ పరుగు జీవీపీ కళాశాల వద్ద యూ టర్న్ తీసుకోగా, 10 కిలోమీటర్ల ఎయిర్‌క్రాఫ్ట్ రన్ తెన్నేటి పార్కు వద్ద తిరిగి స్టార్టింగ్ పాయింట్‌కు చేరుకోవడంతో ముగిసింది. వయోబేధం లేకుండా సరదాగా సాగిపోయే ఫ్రిగేట్ రన్ 5 కిలోమీటర్ల పరుగును కలెక్టర్ హరేందిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మారథాన్ విశాఖలో జరగడం పర్యాటక రంగానికి మరింత ఊతమిస్తుందన్నారు. దాదాపు 15వేల మంది ఔత్సాహికులు సూరీడు లేలేత కిరణాలు సాగరతీరాన్ని తాకుతున్న వేళ పరుగెడుతుండగా.. ఇందులో పలువురు విదేశీయులు భాగస్వాములవడం ఆనందంగా ఉందన్నారు. మారథాన్, హాఫ్ మారథాన్‌లతో పాటు 10 కిలోమీటర్ల పరుగులో తొలి మూడు స్థానాల్లో నిలిచిన మెన్, వుమెన్‌కు విజేతలకు తూర్పు నావికా దళ కమాండ్ నేవల్ చీఫ్ స్టాఫ్ రాజేష్ పెంధార్కర్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నగదు ప్రోత్సాహకాలను అందించారు. రూ.10 లక్షలను విజేతలకు అందించగా.. వీరిలో 16+ కేటగిరీలో ఫుల్ మారథాన్ విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు, సెకండ్ రన్నరప్‌కు రూ.35వేలు అందించారు. హాఫ్ మారథాన్‌లో విజేతలకు రూ.50వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు చొప్పున తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి అందించగా.. 10కే రన్‌లో రూ.25, రూ.15, రూ.10 వేలను తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు అందుకున్నారు. నేవీ మారథాన్ మస్కట్ కృష్ణజింక, విశ్రాంత నేవీ ఉద్యోగి, వెటరన్ అథ్లెట్ వి.రాములు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

విశాఖ చాలా బాగుంది


మిత్రులు ఇచ్చిన సమాచారంతో కెన్యా నుంచి వచ్చాను. ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ రన్‌లో విజేతగా నిలిచాను. విశాఖపట్నం వాతావరణం చాలా బాగుంది. ఇక్కడకు రావడం చాలా ఆనందంగా ఉంది. – మాథ్యూస్, అథ్లెట్, కెన్యా

హాఫ్ మారథాన్ గెలిచా..


మారథాన్‌లో పాల్గొనేందుకు పుణే నుంచి వచ్చాను. సాగర తీరం వెంటే పరుగు పెట్టడం చాలా ఆహ్లాదంగా ఉంది. పరుగును విజయవంతంగా పూర్తి చేసి విజేతగా నిలిచాను. – హసీనా, మహిళల హాఫ్ మారథాన్ విజేత

ఇథియోపియా నుంచి వచ్చా..


భారత్‌లో జరిగిన పలు మారథాన్లలో పాల్గొన్నాను. నేవీ మారథాన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. నగదు బహుమతి అందుకోవడం ఆనందంగా ఉంది. ఇథియోపియా నుంచి వచ్చా.. – అథినో, హాఫ్ మారథాన్ సెకండ్ రన్నరప్

క్లుప్తంగా

విశాఖ చేరుకున్న ఏకసభ్య కమిషన్


రాజీవ్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న ఈడీ సత్యపద్మ

ఎంవీపీకాలనీ: విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ విశాఖ విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించేందుకు ఆయన విశాఖ చేరుకున్నారు. 16న శ్రీకాకుళం జిల్లా, 17న విజయనగరం జిల్లా, 18న విశాఖ జిల్లాలో ఆయన పర్యటించనున్నారు. షెడ్యూల్ కులాల్లో ఉప వర్గీకరణకు సంబంధించి ఆయన ఆయా జిల్లాల్లో మెమోరాండంలు, విజ్ఞప్తులు స్వీకరిస్తారని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

రేపు భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో మేధా సర్వో డ్రైవ్, క్లోవ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ఆస్ట్రా మోటార్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

➡ మేధా సర్వో కంపెనీ ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ పూర్తి చేసిన 25 ఏళ్ల లోపు యువకులకు రూ.15 వేల ఉపకారవేతనంతో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తుంది. డిప్లమోలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అర్హత ఉన్న వారికి అప్రెంటిస్‌షిప్ కాలంలో నెలకు రూ.16వేల స్టైఫండ్ చెల్లిస్తారు. అప్రెంటిస్‌షిప్ కాకుండా ఇదే కంపెనీలో ఉద్యోగం చేయాలనుకునే డిప్లమో లేదా బీటెక్‌లో ఈసీఈ, ఈఈఈ, ఈఐఐ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూ.26,600 జీతం చెల్లిస్తారు.

➡ క్లోవ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో రివిట్ మోడలర్ ఉద్యోగాలకు బీటెక్ సివిల్, మెకానికల్ పూర్తి చేసిన యువకులు అర్హులు.

➡ అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టు, ఫార్మసీ ట్రెనీ ఉద్యోగాలకు బి-ఫార్మసీ, డి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు అర్హులు.

➡ ఆస్ట్రా మోటార్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ చదివిన యువకులు అర్హులు. విశాఖ, హైదరాబాద్, కాకినాడలో పనిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 90147 58949 సంప్రదించవచ్చు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్

మహారాణిపేట: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడని జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ మాట్లాడుతూ 53 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఇన్‌చార్జ్ పరిపాలన అధికారి వి.సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.123
స్కిన్	: రూ.216
స్కిన్‌లెస్	: రూ.206

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	620.00
విజయనగరం	624.00
శ్రీకాకుళం	624.00

సీఎంఆర్ షాపింగ్ మాల్ పునఃప్రారంభం


గోపాలపట్నంలో సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ సంయుక్త మీనన్

గోపాలపట్నం: గోపాలపట్నంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆదివారం పునఃప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ అయిన సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను సరికొత్త హంగులతో తీర్చిదిద్దారు. ఈ మాల్‌ను ఆదివారం ఉదయం 11.30 గంటలకు సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌లో ఉన్న అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్‌లో అన్ని కలెక్షన్లు చాలా తక్కువ ధరల్లో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం సంయుక్త అభిమానులతో సెల్ఫీలు దిగారు. డ్యాన్స్‌లతో ఉత్సాహపరిచారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, ప్రభుత్వ విప్ గణబాబు కుమారుడు పి.మౌర్య సింహా, నవరత్న ఎస్టేట్స్ మేనేజింగ్ పార్టనర్ సంఘ్వీ సురేష్‌కుమార్ జైన్, ల్యాండ్ లార్డ్ పి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరిస్తామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముగిసిన ఆర్గానిక్ మేళా


మ్యాంగో ఐస్‌క్రీమ్ కొనుగోలుకు ఎగబడుతున్న జనం

- ఆఖరి రోజు పోటెత్తిన నగరవాసులు
- గో ఆధారిత ఉత్పత్తులకు ఆదరణ


ఆర్గానిక్ మేళా స్టాళ్ల వద్ద కిటకిటలాడుతున్న జనం

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆర్గానిక్ మేళాకు నగరవాసుల నుంచి అనూహ్య ఆదరణ లభించింది. గో ఆధారిత, సేంద్రియ ప్రకృతి ఆధారిత ఉత్పత్తులను స్టాల్స్‌లో విక్రయించడంతో వీటి కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు. చివరి రోజు ఆదివారం ఆర్గానిక్ మేళా జనంతో కిక్కిరిసింది. ఏ స్టాల్ వద్ద చూసినా కొనుగోళ్ల జాతర కనిపించింది. నగర వాసులు సేంద్రియ ఆహార ఉత్పత్తుల వైపు ఆసక్తి చూపుతున్నారనడానికి ఆర్గానిక్ మేళాకు వచ్చిన స్పందన రుజువని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. లారీ లోడ్‌తో తెచ్చిన మట్టి పాత్రలన్నీ అమ్ముడుపోయాయని చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన రైతు ఆనందం వ్యక్తం చేశారు. మ్యాంగో ఐస్‌క్రీమ్, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, అటవీ ఉత్పత్తులు, సహజ సిద్ధమైన నూనె, సుగంధ ద్రవ్యాలతో కూడిన పదార్థాలు, సువాసనలు వెదజల్లే పూలమొక్కలు ఇలా ఇంటిల్లిపాది అవసరాలకు ఉపయోగపడే వస్తువులను మేళాలో అందుబాటులో ఉంచడంతో.. నగరవాసులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఆనందపురం మండలానికి చెందిన ఓ రైతు ఏర్పాటు చేసిన మ్యాంగో ఐస్‌క్రీమ్ కొనుగోలుకు జనం ఎగబడ్డారు.


ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్న నిర్వాహకులు

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు


హిందూస్థాన్ షిప్‌యార్డ్ పాఠశాల(1984-85) 10వ తరగతి బ్యాచ్

మల్కాపురం: వీరంతా 40 ఏళ్ల కిందట 10వ తరగతి చదువుకున్నారు. తర్వాత ఉన్నత విద్య, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నాటి మిత్రులు మల్కాపురంలోని ఓ కల్యాణ మండపంలో కలిసి.. అప్పటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. మల్కాపురం, శ్రీహరిపురం, గాజువాక తదితర ప్రాంతాలకు చెందిన వారు హిందూస్థాన్ షిప్‌యార్డ్ పాఠశాలలో 1984–85లో 10వ తరగతి పూర్తి చేశారు. అనంతరం మలేషియా, ఖతర్, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులతో స్థిరపడ్డారు. ఇటీవల జరిగిన ఓ వివాహ వేడుకలో నాటి మిత్రులు గంజి శ్రీను, సింగ్, అరుగుల శ్రీను, సుజి మహరాణ, సుధాకర్, శివ, మజ్జి రమేష్‌పాత్రుడు తదితరులు అనుకోకుండా కలుసుకున్నారు. 10వ తరగతి బ్యాచ్ అందరూ ఒకసారి కలుద్దామని నిర్ణయించుకుని.. దూర ప్రాంతాల్లో ఉన్న మిత్రుల ఫోన్ నంబర్లు సేకరించారు. ఆరు నెలల పాటు శ్రమించి అందరినీ ఒకచోటకు చేర్చారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక వారికి ఎన్నో అనుభూతులను మిగిల్చింది. చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి.. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేసి.. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. వయసు మరిచి నృత్యాలు చేశారు.

డీఈఐలో మూడు నెలల కోర్సులు

దరఖాస్తుకు ఈ నెల 31 ఆఖరు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ సెంటర్(డీఈఐ)లో మూడు నెలల కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం టై అండ్ డై కోర్సు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి కోసం మొబైల్ ఫోన్ రిపేరింగ్, మెయింటెనెన్స్ కోర్సు, డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ కోర్సులు, ఇంటర్ పూర్తి చేసిన వారి కోసం కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరైనా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99633 40611 సంప్రదించవచ్చు.

రుషికొండ శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం(టీటీడీ)లో జనవరి 10న జరిగే వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వేకువజామున 3.30 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం 6 గంటల నుంచి 6.40 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తామని.. మరల 6.40 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఆ రోజు భక్తులను ఉచితంగా కొండ పైకి తీసుకొచ్చేందుకు మూడు బస్సులను అదనంగా ఏర్పాటు చేస్తామన్నారు. వీఐపీ, దాతలకు సంబంధించి ప్రత్యేక దర్శన వివరాలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ట్విన్స్ అద్భుత ప్రతిభ


గోల్డ్ మెడల్స్ సాధించిన ట్విన్స్ హవీష్, హవీషా

బీచ్‌రోడ్డు: తమిళనాడులో జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన ట్విన్స్ పితాని హవీష్, పితాని హవీషా జోడీ రెండు గోల్డ్ మెడల్స్ గెలుచుకుంది. 11 నుంచి 14 ఏళ్ల వయసు కేటగిరీలో కపుల్ డ్యాన్స్, షో గ్రూప్ ఈవెంట్లలో వీరు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విజయానికి కోచ్ చిట్టిబాబు(ఆంధ్రప్రదేశ్ కోచ్), పి.సత్యనారాయణ (ఇండియన్ కోచ్) మార్గదర్శకత్వం అందించారు. ట్విన్స్ తల్లిదండ్రులు పితాని రాజశేఖర్, సుమత ఈ విజయం తమకెంతో గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు.

వైదిక, వేద పండితుల పోస్టుల భర్తీకి చర్యలు

- రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మంత్రి ఆనం

సింహాచలం: పంచగ్రామాల భూసమస్యకి త్వరలో పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. పంచగ్రామాల భూసమస్యను త్వరితగతిన పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గడచిన శాసనసభ సమావేశాల సమయంలో ఆ ఎమ్మెల్యేలు, దేవదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, సింహాచలం దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. దేవస్థానానికి చెందిన 420 ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయని, మొత్తం 12,149 కుటుంబీకులు ఆ భూముల్లో ఉన్నారని, వారికి న్యాయం చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజుతో ఆదివా రం సమావేశమై చర్చించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఆయన కొన్ని సూచనలు చేశారని, ఆ సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆలయాల్లో వైదిక, వేదపండితుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దాదాపు 250 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల పోస్టుల భర్తీ ఆలోచన ఉందన్నారు.

గజ్జె ఘల్లుమన్నాదిరో...


అనంతపురం రేలారే బృందం నృత్య ప్రదర్శన


ఆకట్టుకున్న పాడేరు థింసా నృత్యం

సీతంపేట: భారతీయ సంప్రదాయ కళలన్నీ ఒకే వేదికపై కనువిందు చేశాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు ఆయా ప్రాంతాలకు చెందిన సంప్రదాయ కళలను అద్భుతంగా ప్రదర్శించారు. కూచిపూడి, బుర్రకథ, రేలారేరేలా, డప్పుల బృందం, పల్లె సుద్దులు, తంబుర కథ, దేవరపెట్టె, కోలాటం, తప్పెటగుళ్లు, గరగలు, థింసా, జానపద నృత్యాలు, నాటకం, జానపద గీతం, ఏకపాత్రాభినయనం, చైతన్య గీతాలు, తత్వ గీతాలు, నృత్యరూపకాలు ఇలా ఒకటేమిటి సుమారు 30కి పైగా కళాప్రదర్శనలతో 100 మంది కళాకారులు అలరించారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంస్థ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా 'రాష్ట్ర స్థాయి జానపద కళా ఉత్సవం' అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్‌కుమార్ పడహారి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు టి.ఎస్.సుకుమార్, ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కెండేయులు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, ఏపీ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.ఆర్ కృష్ణబాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, కళలను పరిరక్షించడం, కళాకారులను ప్రోత్సహించడంలో ఇస్కఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. కళా ప్రదర్శనల అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించి.. ధ్రువపత్రాలు అందజేశారు. ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.రాజశేఖర్, ఎస్.నరసింహులు, ఏపీ జానపద కళాకారుల సంఘం కార్యదర్శి కుమార్ నాయక్, కోశాధికారి కె.సత్యాంజనేయ, కల్చరల్ సెక్రటరీ సి.హెచ్.మధుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.ఎస్.సురేష్, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ మార్కెండేయులు, కార్యదర్శిగా కె.సత్యాంజనేయ, ఫైనాన్స్ సెక్రటరీలుగా ఎం.ఎ.బేగం, సత్యవతి, జి.సూర్యకుమారి ఎన్నికయ్యారు.

నిద్రలో పళ్ల సెట్ మింగేశారు

తొలగించిన వైద్యులు


గిరిబాబుతో కిమ్స్ వైద్యుడు భరత్


తొలగించిన పళ్ల సెట్

అక్కిరెడ్డిపాలెం: నిద్రలో పళ్ల సెట్ మింగి తీవ్ర ఇబ్బందులకు గురైన వ్యక్తిని కిమ్స్ ఐకాన్ వైద్యుడు ప్రాణాలతో కాపాడారు. మూడేళ్ల కిందట నగరంలోని భవానీ నాయుడుతోటకు చెందిన 52 ఏళ్ల గిరిబాబు కృత్రిమ పళ్లు కట్టించుకున్నారు. ఈ నెల 6న అతను నిద్రలో ఉన్నప్పుడు పళ్ల సెట్ ఊడిపోవడంతో.. తెలియకుండానే మింగేశారు. దీంతో పళ్ల సెట్ ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయి తీవ్ర శ్వాసకోశ ఇబ్బందులకు గురయ్యారు. 7న షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేరారు. అయితే ఎడమ ఊపిరితిత్తి పనిచేస్తుండంతో కొంత ఇబ్బందులను అధిగమించారు. 8న అతనికి వైద్యులు ఎక్స్‌రే, సీటీ స్కాన్ చేశారు. కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ భరత్ ఆ రిపోర్టులను పరిశీలించి.. కుడివైపు ఊపిరితిత్తిలో పళ్ల సెట్ ఉన్నట్లు గుర్తించారు. 9న రిజిడ్ బ్రాంకోస్కోపీ అనే పరికరాన్ని ఉపయోగించి అత్యంత జాగ్రత్తగా పళ్ల సెట్‌ను బయటకు తీశారు. పళ్ల సెట్ ఇరువైపులా ఉండే లోహపు భాగాల వల్ల ఊపిరితిత్తులు, శ్వాసనాళాలకు గాయం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒంపు తిరిగిన వస్తువులను తొలగించడానికి రిజిడ్ బ్రాంకోస్కోపీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతని డాక్టర్ భరత్ తెలిపారు. గిరిబాబు పూర్తిగా కోలుకోవడంతో ఆదివారం డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు. కృత్రిమ పళ్లు కట్టించుకున్న వారు ఎప్పటికప్పుడు దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు. అతుకులు బాగా చేసినప్పటికీ పళ్ల సెట్‌లు ఊడిపోయే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు.